క్లుప్తంగా

మొక్క జొన్న పైరు ధ్వంసం



అడవి పందుల దాడిలో దెబ్బతిన్న పంట

కొలిమిగుండ్ల: మండలంలోని తిమ్మనాయి నపేట రైతు శేషఫణిస్వామి పొలంలోని మొక్క జొన్న పైరును సోమవారం తెల్లవారు జామున అడవి పందులు ధ్వంసం చేశాయి. అడవి పందులు రాకుండా పొలం చుట్టూ చీరలు ఏర్పాటు చేసుకున్నా లాభం లేకుండా పోయిందని రైతు వాపోయాడు. దాదాపు రూ.40 వేలకు పైగా నష్టం వాటిల్లిందన్నారు.

పాస్టర్ కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన పాస్టర్ పాల్ గోపాల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి సోమవారం పాస్టర్ అసోసియేషన్ తరఫున రూ.41 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ల అసోసియేషన్ నాయకులు దానన్న, ప్రసాద్, పాస్టర్లు శేఖర్, ఆనంద్, జయరాజ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణ పూజలో పాల్గొన్న గ్రామస్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం.పెండేకల్లు గ్రామంలో రాములమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు సోమవారం భూమి పూజ నిర్వహించారు. సర్పంచ్ ముచ్చు రామక్క, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, గ్రామస్తులు గోపాల్ రెడ్డి, ఎర్రమల, పరమేష్, మద్దిలేటి ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామ ప్రజలు, దాతల సహకారంతో సుమారు రూ.8 లక్షలతో ఆలయాన్నినిర్మించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

శరవేగంగా డ్రైనేజీ నిర్మాణం



పనులు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ప్యాపిలి: పట్టణంలోని నాలుగు లేన్ల రహదారికి ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. షాదీ ఖానా నుంచి స్టేట్‌బ్యాంకు వరకు మురుగు కాలువ నిర్మిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవి కుమార్ తెలిపారు. కాలువ నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. డీఎంఎఫ్ గ్రాంట్ రూ.1.4 కోట్లతో డ్రైనేజీ పనులు చేపడుతున్నామన్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలని ఆయన కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

చిరుధాన్యాల ఆహారం తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: బాలికలు చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుగుణమ్మ, సాలమ్మ, చిట్టెమ్మలు సూచించారు. స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఉమా మహేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆహారంలో రాగులు, సజ్జ, కొర్ర, జొన్న వంటి తృణధాన్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

ఆశ్రమానికి విద్యార్థినుల చేయూత



దుస్తులు అందజేస్తున్న విద్యార్థినులు

డోన్ టౌన్: పాతపేటకు చెందిన విద్యార్థినులు అనిత, మాలతి హోసన్నా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు. అక్కాచెల్లెలు అయిన వీరిద్దరూ చదువుకుంటూనే డబ్బు కూడబెట్టుకుని తమ తండ్రి ప్రసాద్ (పోలీసు) జ్ఞాపకార్థం వృద్ధాశ్రమానికి చేయూతనిచ్చారు.వీరి ఔదర్యాన్ని చూసి పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్, సూపర్‌వైజర్ భారతి ఉన్నారు.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం

- విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- తాగు నీరు, టేబుళ్లు, ఫ్యాన్లు ఏర్పాటు

డోన్ టౌన్: వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. మండల విద్యాశాఖాధికారులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి ఏర్పాట్లపై ఆరా తీసి, పలు సూచనలు ఇస్తున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని కేంద్రం నిర్వాహకులను ఆదేశిస్తున్నారు.

తొమ్మిది కేంద్రాలు..

ఈ విద్యా సంవత్సరం 2022–23లో మొత్తం 1,730 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరి కోసం 9 కేంద్రాల్లో 80 తరగతులను కేటాయించారు. ఇందులో పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏ, బీ కేంద్రాలు, పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఏ, బీ కేంద్రాలు, ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న ఒనైరో (శ్రీచైతన్య) ఇంగ్లీషు మీడియం స్కూల్లో ఏ, బీ కేంద్రాలతో పాటు నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్, అక్షర అప్పర్ ప్రైమరీ స్కూల్, శ్యాంజో ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో ఒక్కో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చెయ్యడానికి అనుకూల పరిస్థితులను పరిశీలిస్తున్న దృశ్యం

ఎలాంటి ఇబ్బంది పడకుండా..

విద్యార్థులు పరీక్ష కేంద్రంలో ఎలాంటి ఇబ్బంది పడకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. టేబుళ్లు, ఫ్యాన్లు, తాగు నీరు, మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు గదిలోకి గాలి, వెలుతురు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఇక పరీక్షల రోజుల్లో విద్యుత్ కోతలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.

సీసీ కెమెరాల నిఘాలో..

పబ్లిక్ పరీక్షలు జరిగే అన్ని ప్రైవేట్ పాఠశాలల కేంద్రాల్లోని తరగతి గదులకు సీసీ కెమరాలు ఏర్పాటు చేశారు. మొత్తం 9 కేంద్రాల్లో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, పాతపేట జెడ్పీ హైస్కూల్ మినహా మిగిలిన ఐదు కేంద్రాల్లో 48 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇక పట్టణ శివారులోని శ్యాంజో స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రవ వద్దకు ఆర్టీసీ బస్సు సర్వీసు ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సౌకర్యంగా కేంద్రాలు



విద్యార్థులందరికీ అందుబాటులో ఉన్న స్కూళ్లనే పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశాం. ఎవరూ ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. పరీక్షల సమయంలో నేను, సిబ్బంది అందుబాటులో ఉంటాం. ఎవరికైనా ఇబ్బంది కలిగితే నా దృష్టికి తీసుకరావచ్చు.

– ప్రభాకర్, మండల విద్యాధికారి, డోన్

మందుల దుకాణంపై చర్యలు తీసుకోవాలి

డోన్ రూరల్: నాసిరకం మందులు అంటగడుతూ రైతులను మోసం చేస్తున్న ప్యాపిలి మండలంలోని మల్లికార్జున ట్రేడర్స్ మందుల దుకాణంపై చర్యలు తీసుకోవాలని కొత్తకోట గ్రామ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద సోమవారం వ్యవసాయ సహాయ సంచాలకులు పి.అశోక్‌వర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి అబ్దుల్‌షఫీలకు కొత్తకోట గ్రామ రైతులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి చెందిన రైతు గోపాల్‌రెడ్డి ఆముదం పంటకు సోకిన దోమను నివారించుకునేందుకు మల్లికార్జున ట్రేడర్స్ మందుల దుకాణంలో మందు కొనుగోలు చేశాడన్నారు. బిల్లు ఇవ్వకుండా ధనుక పాజిర్, మానిక్ పేరుతో ఉన్న మందులు అంటగట్టాడని వాటిని పిచికారీ చేయడంతో పైరు పూర్తిగా ఎండిపోయిందన్నారు. రైతుకు నష్టం చేకూర్చిన మందుల దుకాణంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి, రైతులు గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, పి.తిమ్మగురుడు, రామచంద్రుడు, ముత్యాలు పాల్గొన్నారు.



ఏడీఏకు వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, గ్రామ రైతులు

ఉపాధ్యాయుడికి ఉగాది జాతీయ పురస్కారం

కొలిమిగుండ్ల: కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సాహిత్య పోటీల్లో మండల పరిధిలోని నాయినపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సత్తెనపల్లె బాబుకు ఉగాది జాతీయ పురస్కారం లభించింది. సోమవారం బెంగళూరులోని ఇండోఏషియన్ విద్యా సంస్థల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా బాబు జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. గడియారం సాహితీ పీఠం ద్వారా పంపిన బసవపురాణం ఒక పరిశీలన అనే గ్రంథం జాతీయ సాహిత్య పురస్కారానికి ఎంపిక కావడంతో తనకు అవార్డు దక్కిందని ఉపాధ్యాయుడు బాబు తెలిపారు.



లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు బాబు

ఘనంగా శివపార్వతుల కల్యాణం

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాస శివరాత్రి సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ఏక శిలారూపంలో కొలువైన శివపార్వతులకు అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణాన్ని సంప్రదాబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

అవుకు: సొంత నిధులతో నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ నేత, దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణా రెడ్డి కుమారుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు, జూనూతల, కొండమనాయునిపల్లె గ్రామాలను ఆయన సోమవారం సందర్శించారు. నీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకుని మూడు గ్రామాల్లో సొంత నిధులతో శుద్ధ జల కేంద్రాలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అవుకు బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను సందర్శించారు.



ఉప్పలపాడులో పర్యటిస్తున్న విఘ్నేశ్వర్ రెడ్డి

ఆలయాలను పరిరక్షించాలి

డోన్ టౌన్: ఆలయాలపై దాడులు అధికమవుతున్నాయని, హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరు కృషి చేయాలని హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు కోరారు. పట్టణ సమీపంలోని చాకిరేవు మిట్ట వద్ద ఉన్న శివాలయంపై కొందరు వ్యక్తులు దాడి చేసి పూజారిని బెదిరించటాన్ని నిరసిస్తూ సోమవారం హిందూ ధార్మిక సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి స్థానిక డీఎస్పీ కార్యాలయం ఎదుట నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు పామయ్య, బీజేపీ నాయకులు హేమసుందర్‌రెడ్డి, ఆర్మీ, రామయ్య, విశ్వహిందూ పరిషత్ సభ్యులు రామకృష్ణతో పాటు పెద్దసంఖ్యలో ప్రజలు నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివాలయంపై దాడి చేసి, పూజారిని గాయపరచం దారుణమన్నారు. విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణ పోలీసుకు ఫిర్యాదు చేశారు.



డీఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున దృశ్యం

మంచి ఫలితాలు సాధించాలి

డోన్ టౌన్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని హెచ్ఎం గంగిరెడ్డి సూచించారు. స్థానిక కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో (లోకల్ ఫండ్ స్కూల్) సోమవారం పదవ తరగతి విద్యార్థులు సరస్వతి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో చదువుతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోక్‌నాథరెడ్డి, నాగయ్య, ఎస్ఎస్ బాబు, నాగలక్ష్మమ్మ, లక్ష్మీదేవి, ప్రభావతి, నూర్జాహాన్, కిరణ్‌కుమార్, రాఘవేంద, పుష్పలత, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సరస్వతి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

పరీక్షల పట్ల భయం వద్దు

ప్యాపిలి: పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతు న్న విద్యార్థులు పరీక్షల పట్ల భయపడొద్దని ఉప విద్యాశాఖాధికారి క్రిష్టఫర్ సూచించారు. మండల పరిధిలోని రాచర్ల, జలదుర్గం ఉన్నత పాఠ శాలల్లో సోమవారం ఆయన పదో తరగతి పరీక్ష ల విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఏప్రిల్ 3 నుంచి జరగనున్న పరీక్షలకు విద్యార్థులు పూర్తి ఆత్మ విశ్వాసంతో ఉండాల న్నారు. పరీక్షల్లో ప్రశ్నాపత్రాన్ని పూర్తిగా చదివిన తరువాతే సమాధానాలు రాయాలన్నారు. చక్క టి చేతిరాతతో మార్కులు ఎక్కువ సాధించవచ్చన్నారు. అనంతరం ఆయన జలదుర్గం, రాచర్ల పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఆయా పాఠశాలల హెచ్ఎంలు తొగట సురేశ్‌బాబు, పురుషోత్తం ఉన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ మోడల్ స్కూల్ సమీపంలో ఆదివారం రాత్రి కర్నూలు వైపు నుంచి బేతంచెర్ల వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి రహదారి పక్కనున్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. మండల కేంద్రానికి చెందిన కొందరు కర్నూలుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

బేతంచెర్ల: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చలో విజయవాడ వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడం సరికాదని, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు సంతోషమ్మ, నారాయణమ్మ, తులసి, లక్ష్మిదేవి, శివలక్ష్మి, పద్మావతి తదితరులు పాత బస్టాండులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

డోన్ టౌన్: ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉచితంగా ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థులకు సీట్లు కేటాయించే విధంగా ప్రభుత్వం జీఓ ఇచ్చిందన్నారు. అందులో భాగంగా ఈనెల 18 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు CSE.AP.GOV.IN అనే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పలువురిపై కేసు నమోదు

డోన్ రూరల్: పట్టణానికి చెందిన నాగరత్నమ్మ, లక్ష్మి, రాజు, భాస్కర్, కృష్ణతో పాటు మరికొంతమందిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నగేష్ తెలిపిన వివరాలు.. పట్టణం సమీపంలోని సుంకులమ్మ గుడి సమీపంలో ఉన్న శివాలయంలో పనిచేస్తున్న సుధాకర్‌స్వామిని బెదిరించి, గుడి స్థలం తమదని, ఖాళీ చేయకపోతే చంపుతామని నాగరత్నమ్మ, లక్ష్మి, రాజు, భాస్కర్, కృష్ణతోపాటు మరికొంత మంది బెదిరించారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోవాలి

డోన్ రూరల్: వైద్యం పేరుతో ప్రజలను మోసం చేస్తున్న ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆర్‌డీఓ కార్యాలయంలో ఏఓ మధును కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రణత్‌యాదవ్ మాట్లాడుతూ వైద్య విద్య అర్హత లేకున్నా గ్రామాల్లో ఇష్టం వచ్చినట్లు క్లినిక్‌లు ఏర్పాటు చేసుకొని ఆర్ఎంపీలు వైద్యం అందిస్తున్నారన్నారు. ప్రథమ చికిత్స మాత్రమే చేయాల్సి ఉండగా ఇంజెక్షన్లు వేస్తూ, సెలైన్‌లు ఎక్కిస్తూ దోచుకుంటున్నారన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

డోన్ రూరల్: బాల్య వివాహాలను అరికట్టాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుగుణమ్మ సూచించారు. చిగురుమాన్ పేటలోని అంగన్‌వాడీ కేంద్రం నుంచి గుత్తి రోడ్డు వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలకు వివాహాలు చేయడం నేరమని, దానిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని వివరించారు. తెలిసీతెలియని వయసులో పెళ్లిళ్లు చేయడం వల్ల వారి జీవితాలు నాశనమతున్నాయన్నారు. అలాంటి ఘటనలు జరిగితే పోలీసులకు, ఐసీడీఎస్ సిబ్బందికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు ఎస్తేరు, షరీఫా, రాణి, మస్తాన్‌బీ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఉత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదేశించారు. సోమవారం ఆలయంలో ఈఓ రామానుజన్ అధ్యక్షతన ఉత్సవాల నిర్వహణపై అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది జ్యోతి బ్రహ్మోత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల భక్తులతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉందన్నారు. ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి, వసతి సౌకర్యంతో పాటు రవాణా తదితర సౌకర్యాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆరోజుల్లో 24 గంటలూ విద్యుత్ సౌకర్యం ఉండేలా చూడాలని సూచించారు. 25, 26 తేదీలతో జ్యోతి ఉత్సవం రోజున నందవరం మీదుగా వెళ్లే భారీ వాహనాలను దారి మళ్లించాలని సీఐ సుబ్బరాయుడు, నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డికి సూచించారు. పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ శివరామయ్యను ఆదేశించారు. అనంతరం దేవస్థానం సిబ్బందికి నూతన వస్త్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అంతకుముందు ఆలయంలో అమ్మవారిని కాటసాని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, విద్యుత్‌శాఖ ఏఈ గర్జప్ప, బనగానపల్లె ఆర్టీసీ డీఎం కిశోర్‌కుమార్, పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మోనిక, లక్ష్మి, అగ్నిమాపకశాఖ అధికారి నరసింహులు పాల్గొన్నారు.

శ్మశాన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కొలిమిగుండ్ల: శ్మశాన వాటికల్లో పనిచేసే మాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మాల శ్మశాన కార్మికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోసుల ఇస్సాక్ కోరారు. సోమవారం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై డిప్యూటీ తహసీల్దార్ రఫీకి వినతి పత్రం అందజేశారు. చనిపోయిన వారి అంత్యక్రియల కోసం గుంతలు తీసే, దహన సంస్కారాలు చేసే కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి, గౌరవ వేతనం, పింఛన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి బాలమద్దయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి షడ్రక్, కోశాధికారి దొరస్వామి, మండల అధ్యక్షులు చంద్రమోహన్, ఉపాధ్యక్షులు నాగయ్య, సెక్రటరీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గోసుల ఇస్సాక్

నీటి సమస్య పరిష్కరిస్తాం

బనగానపల్లె/రూరల్: పట్టణంలోని యాగంటిపల్లె రహదారిలో ఉన్న హరిహర జూనియర్ కళాశాల ప్రాంతంలోని కాలనీలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోమవారం సాయంత్రం పర్యటించారు. స్థానికులు నీటి సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే అధికారులతో మాట్లాడారు. త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి ఉన్నారు.

చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలోని 13 మందికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తన ఇంటి వద్ద లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పరిధిలో లేని జబ్బులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థికంగా ఆదుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 872 మంది లబ్ధిదారులకు రూ.4.90 కోట్లు మంజూరైందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కల్యాణ మండపానికి రూ.3 లక్షల విరాళం



విరాళం నగదును అందజేస్తున్న ఉప్పలపాడు సర్పంచ్ రాధమ్మ



విరాళం అందజేస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

డోన్ టౌన్: మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామ సమీపంలోని జాతీయ రహదారి పక్కన కాశిరెడ్డి నాయన ఆశ్రమం ఆవరణంలో కల్యాణ మండపం నిర్మాణానికి గ్రామ ఉప్పరి రాధమ్మ రూ.3 లక్షలు విరాళమిచ్చారు. సోమవారం భర్త ఉప్పరి రామాంజనేయులుతో కలిసి ఆమె నగదును ఆలయ ధర్మకర్తలు రాజారెడ్డి, ఆచారిలకు అందజేశారు.

ఉపాధ్యాయులు, విద్యార్థుల దాతృత్వం

స్థానిక పాతపేట జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తలా కొంత నగదు పోగు చేసి రూ.1 లక్ష నగదును నెల్లూరు జిల్లా గూడూరు జ్ఞాననేత్ర అంధుల స్వచ్ఛంధ సేవా సంస్థకు విరాళంగా అందజేశారు. సోమవారం పాఠశాలలో జ్ఞాననేత్ర అంధుల స్వచ్ఛంధ సేవా సంస్థ గాన కచేరీ నిర్వహించారు. సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌కు విరాళం మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, ప్రసాద్‌రావు, లక్ష్మయ్య, శివప్రసాద్, లీలావతమ్మ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

కృష్ణగిరి: రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని డోన్ ఆపరేషన్ డీఈ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో నూతనంగా సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు సోమవారం ఆయన ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, కన్‌స్ట్రక్షన్ డీఈ రాజేష్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. త్వరలో భూమి పూజ చేసి పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో గ్రామంతోపాటు కోయిలకొండ, పెద్దొడ్డి తదితర గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. ట్రాన్స్‌కో ఏఈమద్దిలేటి, సర్వేయర్ వెంకటసుబ్బయ్య, వీఆర్వో అయ్యన్న, లైన్‌మెన్ ధనుంజయగౌడ్ ఉన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

నంద్యాల(సిటీ): జాతీయ స్థాయి సబ్‌జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు నంద్యాల జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ప్రతినిధులు మహబూబ్‌బాషా, రామేశ్వరరెడ్డి, రాజకుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ జనవరి 13, 14వ తేదీల్లో కృష్ణా జిల్లా గన్నవరంలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో నంద్యాల జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ చూపిన క్రీడాకారులు ఎస్.నరేష్, డీ. దస్తగిరి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని చెప్పారు. కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న వీరు రాష్ట్ర జట్టు తరుపున ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు అస్సాంలోని గౌహతిలో జరిగే సబ్ జూనియర్ బాలుర జాతీయ హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్షావలిని అభినందించారు.



ఎస్.నరేష్



డి.దస్తగిరి

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వెల్దుర్తి: మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ పరిధిలో గుత్తకు తీసుకున్న పొలంలో బేతంచెర్ల మండలం పెండేకల్లుకు చెందిన కుమ్మరి వెంకటరమణ (40) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై ఏఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. వెంకటరమణ, లక్ష్మీదేవి దంపతులు కూలీతోపాటు పొలం గుత్తకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లల స్కూలు ఫీజు కట్టే విషయంలో దంపతుల మధ్య ఆదివారం గొడవ జరిగింది. తర్వాత పొలానికి వెళ్లిన వెంకటరమణ చెట్టుకు పంచెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు, సాయంత్రం పొలంవైపు వెళ్లిన గొర్రెల కాపరులు మృతదేహాన్ని గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ తెలిపారు.